సాక్షి నంద్యాల

సోమవారం | 16 | డిసెంబర్ | 2024



శ్రీశైల దేవస్థానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి అదివారం విశాఖపట్నంకు చెందిన పి.ఈశ్వరమ్మ రూ.1,00,116 విరాళం అందజేశారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా ఆదివారం నెల్లూరు వేంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ బృందం కళాకారులు భక్తిగీతాలకు సంప్రదాయ నృత్యప్రదర్శన చేసి అలరించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.10
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 90.746
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,122
అవుట్ ఫ్లో	: 5,961

న్యూస్‌రీల్

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి తరవచ్చిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది శ్రీగిరి చేరుకున్నారు. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలలో బారులు తీరారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూడు సార్లు మాత్రమే స్వామి వారి స్పర్శ దర్శనం కల్పించారు.

పల్లకి ఉత్సవం

శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మ వార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు.

శ్రీశైల డ్యాం నీటిమట్టం 863.80 అడుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయ నీటిమట్టం ఆదివారం సాయంత్రం సమయానికి 863.80 అడుగులకు చేరింది.జలాశయంలో 118.3380 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శనివారం నుంచి ఆదివారం వరకు ఎడమగట్టు కేంద్రంలో పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 6,078 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు. అక్కడి నుంచి 5,579 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 2.570 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 11,040 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం

నంద్యాల: పట్టణంలోని కలెక్టరేట్ సెంటీనరి హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజక వర్గ, మండల స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

మహానందిలో సండే సందడి



చిన్న కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: మహానందిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో పాటు పెళ్లిళ్లు జరగడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కనిపించింది. భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఉచిత, శీఘ్ర, స్పర్శదర్శనం, అభిషేకం, అర్జిత సేవా టికెట్ల ద్వారా కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. కాగా మహానందీశ్వరుడి దంపతులకు ఆదివారం ఉదయం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహించి రాత్రి యాగశాలలో స్వామి, అమ్మవారికి ఏకాంతసేవ పూజలు చేశారు.

ప్రజావాణిపై అణచివేత తగదు

కర్నూలు(సెంట్రల్): సమాజంలో పౌరుల వాక్ స్వాతంత్రపు హక్కులను కాలరాస్తున్నారని, ప్రజావాణిని వినిపిస్తే అణచివేసేందుకు ప్రభుత్వాలు పూనుకోవడం ఆందోళనకరమని సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం అధ్యక్షుడు ఓంకార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో 'నేటి సమాజంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీఆర్ఎస్ అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ.. కవులు, కళాకారులు, ప్రజాస్వామ్యవాదులపై కేసులు నమోదవుతుండడం ఆందోళనకరమన్నారు. పౌరుడిగా ఏది సరైనది.. ఏది కాదు అనిచెప్పే స్వేచ్ఛ ఉండాలన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు న్యాయం జరగాలని, ఇందుకోసం పటిష్టమైన న్యాయ వ్యవస్థ ఉండాలన్నారు.

25 కిలోలు.. రూ.80



ఈ చిత్రంలోని రైతు పేరు శ్రీనివాసులు, ఊరు పత్తికొండ. ఈయన శనివారం మార్కెట్‌కు 32 బాక్స్‌ల టమాట తెచ్చారు. వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు హోల్‌సేల్‌గా కిలో రూ.8కి తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఉత్సాహంగా వచ్చాడు. కానీ మార్కెట్‌లో వ్యాపారులు మాత్రం మంత్రి ఆదేశాలు ఎక్కడా పాటించలేదు. 25 కిలోలకు కేవలం రూ.80 ధర లభించింది. కిలో ప్రకారం లభించిన ధర రూ.3 మాత్రమే. కొంత మంది రైతులకు 25 కిలోలకు రూ.50 మాత్రమే లభించింది. 'ధరలు ఇలా ఉంటే రైతులు ఎలా బాగుపడుతారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి' అని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు.

సోలార్ డ్రైయర్లను ఏమి చేయాలి



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు మాబూనీ. గోనెగండ్ల మండలం పెద్ద నెలటూరు. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం సోలార్ డ్రైయర్ మంజూరు చేసింది. ఏడాదిలో నాలుగు నెలలు మినహా మిగిలిన అన్ని నెలలు టమాట లేదా ఉల్లి సరఫరా చేయాలి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరిని అధికారులు పట్టించుకోవడం లేదు. ఓ వైపు ధర లేక రైతులు టమాటలు రోడ్డున పడేస్తున్నా సోలార్ డ్రైయర్ల లబ్ధిదారులకు సరఫరా చేయడంలో అధికారులు చేతులెత్తేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి టీజీ భరత్ జిల్లా వాసి అయినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టమాటల మంత్రులు

- మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు బేఖాతర్
- కిలో రూ. 8 తక్కువకు కొనరాదని చెప్పినా పట్టించుకోని వ్యాపారులు
- ధరలు పడిపోయి నష్టపోతున్న రైతులు
- సమీకృత టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఆశలు గల్లంతు
- మరుగున పడిన సోలార్ డ్రైయర్లు
- పట్టించుకోని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి టీజీ భరత్

మంత్రి అచ్చెన్న ఆదేశాలు బుట్ట దాఖలు..



టీజీ భరత్ గారూ.. కాస్త ఇటు చూడరు..



కర్నూలు(అగ్రికల్చర్): దశాబ్దాలుగా టమాట రైతుల కష్టం రోడ్డు పాలవుతోంది. ఏటా పంట చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం రైతులు నష్టపోవడం జరుగుతూనే ఉంది. అధికారులూ, పాలకులు చూస్తూనే ఉన్నారే కానీ సమస్యను పట్టించుకోవడం లేదు. సమస్య తీవ్రమైనప్పుడు హడావుడి చేయడం, ఆ తర్వాత విస్మరించడం రివాజుగా మారుతోంది. ఇటీవల టమాట ధరలు పడిపోయి రైతులు పంటను రోడ్లపై పారబోశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ, అనుబంధ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు.. 'రైతులు మార్కెట్‌కు తెచ్చిన పంటను హోల్‌సేల్‌గా కిలో రూ.8 కంటే తక్కువకు కొనరాదు' అని ఆదేశించారు. అయితే మంత్రి ఆదేశాలు ఎక్కడా అమలు కాలేదు. 25 కిలోల బాక్స్ రూ.50 నుంచి రూ.80 వరకు ధరతో కొనుగోలు చేశారు. అంటే కిలో ధర రూ.2 నుంచి రూ.3 వరకు మాత్రమే పలికింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల కలను సాకారం చేసేలా పత్తికొండలో మొదలు పెట్టిన టమాట ప్రాసెసింగ్ యూనిట్ ప్రక్రియ పూర్తయి ఉన్నా.. ఈ సమస్య ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో ధరలు పడిపోయినప్పుడు మార్కెటింగ్ శాఖ కొనుగోలు ప్రక్రియలో పాల్గొని కిలో రూ.8కి తక్కువ లేకుండా కొనుగోలు చేసింది. ఇందుకు అనుగుణంగా వ్యాపారులు ధరలు పెంచారు. నేడు ఈ పరిస్థితి లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. అలాగే గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన సోలార్ డ్రైయర్లు నేడు ప్రోత్సాహం లేక మూలన పడిపోయాయి.

పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీకి రోజుకు 50 టన్నులు వరకు టమాట వస్తుంది. ధరలు పడిపోతుండటంతో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ మాత్రం ఇప్పటి వరకు తూతూ మంత్రంగా కొనుగోళ్లు చేపట్టింది. నాలుగు రోజుల వ్యవధిలో మార్కెట్‌కు 200 టన్నులకు పైగా రాగా అధికారులు 48 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అలాగే క్వింటా రూ. 800 తగ్గకుండా కొనాలని మంత్రి ఆదేశించినా.. రెండు వందల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్.. ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే మంత్రిగా ఉంటే ఇటు పరిశ్రమలు, అటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఒక వెలుగు వెలగాల్సి ఉంది. జిల్లాలో గత ప్రభుత్వంలో ఏర్పాటు అయినా సోలార్ డ్రైయర్లు ప్రస్తుతం మరుగున పడినా స్పందన లేదు. ఇటీవల జిల్లా కేంద్రం కర్నూలులో ఉల్లి రైతులు పడరాని పాట్లు పడ్డారు. పంట అమ్ముకోవడానికి రోజుల తరబడి అవస్థలు పడ్డారు. ప్రస్తుతం టమాటకు ధర లేక రోడ్లపై పారబోస్తున్నారు.



ధర లేకపోవడంతో పత్తికొండ మార్కెట్ యార్డులో రైతులు పారబోసిన టమాటలు

సోలార్ డ్రైయర్లను ఏమి చేయాలి..

టమాట, ఉల్లి రైతుల సంక్షేమానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. మహిళల జీవనోపాధుల అభివృద్ధి లక్ష్యంగా సోలార్ డ్రైయర్లను మంజూరు చేసి ప్రోత్సహించింది. వీటి ఏర్పాటుతో టమాట, ఉల్లి రైతులకు ఎంతో ఊరట కలిగింది. కల్లూరు, గోనెగండ్ల, గూడూరు మండలాల్లో రెండేళ్లలో 163 సోలార్ డ్రైయర్లను అందజేసి ఉపాధి చూపించింది. వీటి ద్వారా మహిళలు ఇంట్లో కూర్చొనే నెలకు రూ.20 వేలకుపైగా ఆదాయం పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సోలార్ డ్రైయర్లను పట్టించుకునే దిక్కు లేదు. మామూలుగా అయితే ఏడాదిలో 9 నెలలు పనిచేయాల్సి ఉంది. గత ఏడాది డిసెంబరు నెలలో ఏర్పాటు చేసిన సోలార్ డ్రైయర్లు ముచ్చటగా మూడు నెలలు మాత్రమే పని చేశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడిచిపోయినా.. ఇంతవరకు వీటికి కిలో టమాట, ఉల్లి సరఫరా కాలేదు. సోలార్ డ్రైయర్లు పూర్తిగా మరుగున పడ్డాయి. లబ్ధిదారులపై అప్పులు మీద పడ్డాయి. ఈ ఏడాది సెప్టెంబరు 12న సాక్షిలో 'ఉపాధి కరువై... రుణాలు బరువై' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో జిల్లా యంత్రాంగం స్పందించింది. ఎస్4ఎస్ కంపెనీతో సోలార్ డ్రైయర్లు పొందిన వారి ఈఎంఐలు రెండు నెలలు కట్టింది. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో బ్యాంకుల నుంచి ఈఎంఐలు చెల్లించాలని ఒత్తిళ్లు పెరిగాయి. లబ్ధిదారులకు రూ.60 వేలు సబ్సిడీ విడుదలైతే.. ఈ మొత్తాన్ని బ్యాంకు రుణానికి జమ చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల్లోని అమౌంట్‌ను హోల్డ్‌లో ఉంచడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మూలన పడిన సోలార్ డ్రైయర్లు

సరఫరాలో నిర్లక్ష్యం..

టమాట, ఉల్లి ఫ్లేక్స్ తయారీకి సీ, డీ గ్రేడ్ ఉల్లి, టమాట అవసరమవుతాయి. కొద్ది రోజులుగా టమాటకు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారు. 25 కిలోల బాక్స్‌కు లభిస్తున్న ధర రూ.50 వరకే. ఈ సమయంలో టమాట సోలార్ డ్రైయర్లకు సరఫరా చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మహిళలకు ఉపాధి లభిస్తుంది. టమాట ధరలు పడిపోయి అల్లాడుతున్నా... సోలార్ డ్రైయర్లు ఉన్నా.. పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఉల్లికి నేడు ధరలు కొంత మెరుగ్గా ఉన్నా.. సీ, డీ గ్రేడ్ రకాలు తక్కువ ధరకే లభిస్తాయి. కానీ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గతంలో చురుగ్గా పనిచేసిన ఎస్4ఎస్ సంస్థ కూడా చొరవ తీసుకోవడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఉల్లి, టమాట రైతులకు మేలు చేయాలనే లక్ష్యంలోనే సోలార్ డ్రైయర్లు ఏర్పాటు అయ్యాయి. దీంతో 2022-23, 2023-24 సంవత్సరాల్లో ధరలు లేని సమయంలో వీటికి సరఫరా చేయడంతో రైతులకు ఎంతో మేలు జరిగింది. కర్నూలు జిల్లా నుంచే ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ ఉన్నా.. ఎలాంటి చొరవ చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఒకవైపు మహిళలు ఉపాధి కోల్పోగా... మరోవైపు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

టమాట ప్రాసెసింగ్ పరిశ్రమకు ఉరి

సమీకృత టమాట ప్రాసెసింగ్ యూనిట్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసి పనులు ప్రారంభించింది. పత్తికొండ సమీపంలో హోసూరు రోడ్డులోని సర్వే నెంబరు 286/1ఏ3, 286/1ఏ4, 286/1ఏ5ల్లోని 3.60 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.12.05 కోట్లతో నిర్మాణం తలపెట్టింది. ఈ ఏడాది మే నెల చివరి వరకు పనులు కూడా చురుగ్గా జరుగుతూ వచ్చాయి. ఈ ఏడాది జూన్ నెలలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రాసెసింగ్ యూనిట్ భవితవ్యం ప్రశ్నార్థకం అయింది. ఊహించినట్లుగానే టీడీపీ నేతలు తమ స్వార్థంలో భాగంగా ప్రాసెసింగ్ యూనిట్‌ను మరోచోటుకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. మళ్లీ డీపీఆర్ తయారు చేయడం, నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సి వచ్చింది. దీంతో టమాట ప్రాసెసింగ్ పరిశ్రమ ఆశలు ఆవిరికావడంతో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి.



కూటమి ప్రభుత్వానికి ముందు టమాట ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సంజీవ్‌నగర్ గేట్ దగ్గర ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో తాము ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నామన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్

జాతిపిత మహాత్మా గాంధీ ప్రభావంతో సత్యం, శాంతి మార్గంలో నడిచారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం కఠోర నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబర్ 15న శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఉప ఖజానా అధికారి లక్ష్మీదేవి, పశుసంవర్ధకశాఖ అధికారి గోవింద నాయక్, టూరిజం అధికారి సత్యనారాయణ, జిల్లా క్రీడల అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

'బావి' తరాల కోసం..





శతాబ్దాల చరిత్ర ఉన్న మెట్ల బావులు మన సంస్కృతిలో భాగం. అయితే అవి నేడు నిరాదరణకు గురై.. రూపురేఖలు కోల్పోయాయి. కొత్తపల్లె మండలం గువ్వలకుంట గ్రామంలో కూడా ఇలాంటి ఒక పురాతన బావి ఉంది. ఒకప్పుడు ప్రజలకు ఎంతో ఉపయోగపడిన దీనిని పునరుద్ధరించి భావితరాలకు అందించేందుకు నంద్యాలకు చెందిన 'మన ఊరు, మన గుడి, మన బాధ్యత' అనే సంస్థ సభ్యులు నడుం బిగించారు. ఆదివారం ఏకంగా 80 మంది గువ్వల కుంట్ల చేరుకుని బావిలోని చెత్తాచెదారాన్ని ఏరివేసి, మురుగు నీటిని మోటార్ల ద్వారా తోడి శుభ్ర పరిచారు. చారిత్రక మెట్లబావిని పునరుద్ధరించి ఎన్నో జీవరాశులకు కేంద్రంగా మార్చిన ఆ సంస్థ సభ్యులు ఎంపీ శివకుమార్ రెడ్డి, రఘువీర్, డాక్టర్ కిశోర్, డాక్టర్ రావు, హరికృష్ణ, రాధా ప్రసాద్, సీతారాం రెడ్డి తదితరులను గ్రామస్తులు ఈ సందర్భంగా అభినందించారు. -ఆత్మకూరు రూరల్

గుండెగుబిల్లు

- నంద్యాలలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన ఇస్మాయిల్ కార్పెంటర్‌గా పనిచేస్తాడు. ఇతని దుకాణానికి సంబంధించి కరెంట్ బిల్లు నెలకు రూ.2,600 వరకు వచ్చేది. నవంబర్ నెలలో రూ. 3,100, డిసెంబర్‌లో రూ.3,300 కరెంట్ బిల్లు రావడంతో ఖంగుతిన్నాడు.
- బనగానపల్లె పట్టణం కొండపేటలో టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సుబ్బయ్యకు గతంలో నెలకు రూ.1800 వరకు కరెంట్ బిల్లు వచ్చేది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఏకంగా రూ.2,300 బిల్లు వచ్చింది. ఒకేసారి రూ.500 బిల్లు పెరగడంతో లబోదిబోమంటున్నాడు.
- గడివేముల మండలం గని గ్రామానికి చెందిన యోహాన్ ఇంటికి నెలకు రూ.300 విద్యుత్ బిల్లు వచ్చేది. ఈనెల ఏకంగా రూ.450 రావడంతో ఆందోళనకు గురయ్యాడు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి అంత బిల్లు రావడంతో సకాలంలో చెల్లించలేని పరిస్థితి.

- వినియోగదారులపై భారీగా విద్యుత్ చార్జీల భారం
- యూనిట్ పై రూ.2.20 పైసలు అదనం
- డిసెంబర్ నెల నుంచే అమలు
- ఆరునెలల కాలంలోనే రెండు సార్లు పెంచిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 6.56 లక్షల మంది వినియోగదారులు
- వందకోట్లకుపైగా అదనపు భారం
- లబోదిబోమంటున్న పేదలు



నంద్యాల(అర్బన్): ఎన్నికల ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు బిల్లులు పెంచనని హామీ ఇచ్చిన బాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి తన మార్కు మోసాన్ని చూపించారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట గత నెలలోనే వినియోగదారులపై భారం మోపిన సర్కారు తాజాగా మరోసారి పెంచేసింది. 2026 వరకు ఈ బాదుడును వినియోగదారులు భరించేలా తీర్మానించి కొత్త చార్జీలను అమల్లోకి తెచ్చారు. దీనికి విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నుంచి ఆమోదం సైతం లభించడంతో జనం నెత్తిన అదనపు భారం పడింది.

వరుసగా రెండోసారి చార్జీల మోత

ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట ఇటీవలే డిస్కంల ప్రతిపాదనలను నియంత్రణ మండలి ఆమోదించడంతో దాదాపుగా ఎల్టీ(డొమెస్టిక్)వినియోగదారుని విద్యుత్ వినియోగ యూనిట్‌కు గరిష్టంగా రూ.2.20 వరకు పెరిగింది. రెండు నెలల క్రితం యూనిట్ వినియోగ చార్జీలు రూ.1.26 వరకు పెంచేసిన సర్కారు ఇప్పుడు రెండోసారి మరో రూ.0.92 వరకు పెంచేస్తూ నిర్ణయించింది. దీంతో వరుసగా రెండు సార్లు చార్జీల పెంపు అమలు చేయడంతో వినియోగ దారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మొదటి పెంపుతో నవంబర్ నుంచి 2026 జనవరి వరకు, అలాగే రెండో దఫా పెంపుతో ఈనెల నుంచి-2026 నవంబర్ వరకు భారం పడనుంది.

ప్రభుత్వం చేతులెత్తేయడంతోనే...

వాస్తవానికి ఇంధన విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు చార్జీలను ఎప్పటి కప్పుడు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలే బాధ్యత వహించి ఆ నష్టాలను భరిస్తూ ఉంటాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. విద్యుత్ కొనుగోలు భారాలను ప్రజలపై రుద్దాలని నిర్ణయించుకుని గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే రెండు సార్లు చార్జీల పెంపుతో బాదేసింది. పెరిగిన కరెంట్ చార్జీలతో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఈనెల నుంచే అదనపు భారం..

జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ డివిజన్ల పరిధిలో మొత్తం 6.56 లక్షలు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 292 హెచ్‌టీ కనెక్షన్లు కాగా మిగిలినవన్నీ ఎల్‌టీ వినియోగదారులే. ఇంత వరకు ఈ విద్యుత్ కనెక్షన్ల నుంచి విద్యుత్ వినియోగం దృష్ట్యా అన్ని రకాల చార్జీలతో కలిపి రూ. 67.29 కోట్లు కాగా, నవంబర్ నెలాఖరుకు (మొదటి సర్దుబాటు చార్జీతో కలిపి) డిమాండ్ ఏకంగా రూ.68.93 కోట్లు వరకు పెరిగింది. ఇక రెండోసారి సర్దుబాటు చార్జీలతో కలిపితే ఈ డిమాండ్ మరో రూ.1.02 కోట్ల వరకు పెరిగే అవకాశాలున్నాయని విద్యుత్ శాఖ అధికారులే చెబుతున్నారు. కరెంటు వినియోగం పెరిగే క్రమంలో ఈ యూనిట్ చార్జీల పెంపు కూడా తోడైతే కచ్చితంగా వినియోదారుడిపై మరింత భారం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా పరిణామాలతో ఎల్టీ వినియోగదారుడికి యూనిట్‌కు ప్రస్తుతానికి రూ.1.20 వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం సర్దుబాటు చార్జీల కింద అదనంగా రూ.92 పైసల నుంచి ఒక్క రూపాయి పెంచే దిశగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ లెక్కన సగటునా ఒక్కో యూనిట్‌పై రూ.2.20 భారం పడనుంది. నంద్యాల జిల్లాలో 6.56 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రోజువారి 15లక్షల యూనిట్ల కరెంట్‌ను వినియోగిస్తున్నారు. దీంతో పాటు చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమలు జిల్లాలో 4వేలకు పైగా ఉన్నాయి. ఇంధన సర్దుబాటు చార్జీలతో ఒక్కో వినియోగదారుడిపై రోజుకు రూ.3 అనుకున్నా నెలకు రూ.90 చొప్పున భారం పడనుంది. ఇది కూడా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి మాత్రమే కావడం గమనార్హం. 200 యూనిట్ల పైన కరెంట్ వాడుతున్న వారికి స్లాబ్ మారిపోతుంది. ఏదిఏమైనా చార్జీల పెంపుతో ఏటా జిల్లాపై వందకోట్ల రూపాయలకు పైగా అదనపు భారం పడనుంది.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



రూ.100 విద్యుత్ బిల్లు చెల్లించాలంటేనే నానా యాతన పడతాం.పనికెళ్తే గానీ కుండ కాలని పరిస్థితి. ఒకేసారి నెలబిల్లు రూ.200 చేస్తే ఎలా చెల్లించాలి.ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి మాలాంటి పేదలపై భారం మోపింది. పునరాలోచన చేసి విద్యుత్‌చార్జీల భారాన్ని తగ్గించాలి.

– ఉసేనమ్మ, కానాల, నంద్యాల (మం)

నమ్మించి మోసం



ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పారు. అధికారంలోకి వచ్చాక వరుసగా రెండు సార్లు చార్జీలు పెంచారు. చంద్రబాబునాయుడు గతంలో కూడా ఇలాగే నమ్మించి పేదలపై మోయలేని విధంగా విద్యుత్ భారం వేశారు. ఎప్పుడూ లేని విధంగా ఈ రెండు నెలల నుంచి రూ.200 వరకు అదనంగా బిల్లు వస్తుంది.

– ఏహియా, నంద్యాల

క్లుప్తంగా

మాజీ సైనికుడి మృతి


చంద్రశేఖర్(ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని శిల్పా టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు ఏ.చంద్రశేఖర్ అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఎంఈజీలో 20 సంవత్సరాలు నాయక్‌గా సర్వీస్ చేసిన అనంతరం ఆయన ఎస్‌బీఐలో కూడా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. చంద్రశేఖర్ ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

ప్రమాదంలో విద్యార్థి మృతి


మృతి చెందిన అశోక్

బనగానపల్లె: మండలంలోని నందివర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 8వ తరగతి విద్యార్థి మర్రిమదన్ అశోక్ (14) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. అశోక్ ఇంటి సమీపంలోని మలుపు వద్ద నిలబడి ఉండగా ఎదురుగా వచ్చిన బొలేరో క్యాంపర్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని, డ్రైవర్ కానాల నాగన్నపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. అశోక్ తండ్రి మదనగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

వివాహిత గొంతునులిమి హత్య


హత్యకు గురైన హినాబీ

నందికొట్కూరు: మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో షేక్ హినాబీ (22) అనే మహిళను భర్త షేక్ రహంతుల్లా, అత్త షేక్ నిజామున్ గొంతునులిమి హత్య చేసిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగానే హత్య జరిగినట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. మూడేళ్ల క్రితం రహంతుల్లా, హినాబీల వివాహం పెద్దల సమక్షంలో జరిగింది. ఆ దంపతులకు సంతానం కలగలేదు. ఈ క్రమంలో భర్త, అత్త వేధింపులకు గురి చేయడంతోపాటు తన కుమార్తెను హత్య చేశారని మృతురాలి తల్లి పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రామాంజనేయులు నాయక్, రూరల్ సీఐ సుబ్రమణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్

నందవరం: ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాసులు నందవరం, నాగలదిన్నె గ్రామాల సమీపంలో ఇసుక అక్రమ తరలింపుపై నిఘా పెట్టారు. ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎమ్మిగనూరుకు చెందిన ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. రికార్డులు పరిశీలించి జరిమానా విధిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. దాడుల్లో డీఎస్‌డీటీ మహేష్, ఆర్ఐ జెర్మియా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు బాలారిష్టాలు

- నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఆరు నెలలైనా అందని పుస్తకాలు
- చిన్నారులకు పలకలే దిక్కు
- గత ప్రభుత్వంలో కాన్వెంట్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు


అంగన్‌వాడీ కేంద్రంలో పుస్తకాలు లేక ఖాళీ చేతులతో చిన్నారులు

కర్నూలు న్యూసిటీ: నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు. అలాంటి బాలలకు ప్రాథమిక దశలో అక్షరాలు దిద్దించి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు పౌష్టికాహారం అందిస్తూ మంచి ఆరోగ్యంతో ఉండేలా తీర్చిదిద్దేవి అంగన్‌వాడీ కేంద్రాలే. పిల్లలకు ఆరేళ్ల వయస్సు వచ్చే వరకు పౌష్టికాహారం అందించడం వల్ల శారీరక, మానసికంగా ఎదుగుదల బాగుంటుంది. అలాగే సేచ్ఛా వాతావరణంలో ఆహ్లాదకరంగా విద్యాభ్యాసానికి అలవాటు పడితే భవిష్యత్తులో చదువులో రాణిస్తారు. పిల్లలకు చదువుపై ఉత్సుకత, ఏకాగ్రత అలవర్చే అంగన్‌వాడీ కేంద్రాలను గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదర్శంగా తీర్చిదిద్దారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రీప్రైమరీ- 1, ప్రీప్రైమరీ - 2 కిట్ల రూపంలో ఐదు రకాల పుస్తకాలు అందజేసి, వాటి ద్వారా ఆసక్తికరమైన, సులభతర విద్యాభ్యాసానికి నాంది పలికడంతో పాటు వారిలో సృజనాత్మకత పెరిగేలా పెద్దపీట వేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటన్నింటినీ రద్దు చేసి అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా ఇంత వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు పంపకుండా చిన్నారుల అక్షర జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేస్తోంది.

అంగన్‌వాడీ చిన్నారుల చదువుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చిన్నారుల పౌష్టికాహారం, చదువులపై నీలి నీడలు కమ్ముకున్నాయి. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా చిన్నారులకు పుస్తకాలను కూడా అందించలేని దుస్థితిలో కూటమి సర్కారు ఉంది. తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ చిన్నారులకు మెరుగైన వసతులతో కూడిన విద్యను అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నాయకులు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు పుస్తకాలు లేక పలక, బలపమే దిక్కయ్యాయి. పుస్తకాలు లేకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారులతో పలకలపై అక్షరాలు దిద్దించడంతో సరిపెట్టేస్తున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు
జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1886 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 1866 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 20 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3 – 6 సంవత్సరాల్లోపు చిన్నారులు 47,124 మంది ఉన్నారు.

గతంలో ప్రైవేటు కాన్వెంట్లకు పోటీగా..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పేద చిన్నారులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి అభివృద్ధికి కృషి చేశారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రీప్రైమరీ – 1, ప్రీప్రైమరీ -2 కిట్లను చిన్నారులకు అందించింది. వీటిలోని ఆకర్షణీయమైన బొమ్మల వల్ల చిన్నారులకు పుస్తకాలపై ఇష్టం కలిగి చదువుకునేందుకు శ్రద్ధ చూపేవారు. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో చదువు చెప్పడంతో ఎక్కువమంది తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేవారు. మూడు సంవత్సరాల నుంచి నాలుగు సంవత్సరాల పిల్లలకు ఇంగ్లిష్, మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన ప్రీప్రైమరీ- 1 కిట్లు ఇచ్చేవారు. అదేవిధంగా 4 – 5 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ఐదు పుస్తకాలతో కూడిన ప్రీప్రైమరీ- 2 కిట్లు అందించారు.

> **గత ప్రభుత్వ బొమ్మలు ఉన్నందుకు పుస్తకాలు మాయం**
>
> వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన చర్యలతో అంగన్‌వాడీ విద్యాబోధన చిన్నారుల తల్లిదండ్రులను ఆకట్టుకుంది. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ విద్యబోధనపై కక్షగట్టింది. పుస్తకాలను పంపిణీ చేయకుండా చిన్నారుల చదువులపై కత్తి దూస్తోంది. అంగన్‌వాడీ సిబ్బంది కొత్త పుస్తకాలు వచ్చే వరకు పాత పుస్తకాలను వాడుకుంటూ పిల్లలకు చదువు చెప్పేవారు. వాటిపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో ఉందనే అక్కసుతో ఏకంగా ఆ పుస్తకాలను కనుమరుగు చేసింది. ఇదేమని అడిగితే అధికార పార్టీ నాయకులు వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉంటుందని పుస్తకాలను పిల్లల ఇళ్లకు పంపిణీ చేశామని చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వం అమలుచేసిన విద్యా విధానాన్ని మాత్రం యథావిధిగా కాపీ కొడుతూ వాట్సాప్ ద్వారా కార్యకర్తలతో విద్యాబోధన చేయించడం గమనార్హం.


వాట్సాప్ గ్రూప్ ద్వారా పాఠాలు

నేడు పలకలకే పరిమితం

కూటమి ప్రభుత్వం చర్యలతో అంగన్‌వాడీ కేంద్రాలు నీరసించిపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు పుస్తకాలు అందించాలి. కానీ ఆరు నెలలు గడిచినా ఇంతవరకు కేంద్రాలకు పుస్తకాలు చేరుకోలేదు. ప్రీప్రైమరీ- 1, ప్రీ? అసలు పంపుతుందో, లేదో? అన్న అయోమయంతో ఎదురు చూస్తున్నారు.

పుస్తకాలు రాలేదు

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటివరకు పుస్తకాలు రాలేదు. ఎప్పుడు వస్తాయన్న సమాచారం కూడా లేదు. చాల చోట్ల సిబ్బంది పాత పుస్తకాలతో సర్దుకుంటున్నారు. విద్యార్థులు చదువుకోవడానికి పుస్తకాల కొరత ఆటంకంగా మారకుండా కార్యకర్తలు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో బోధిస్తున్నారు.

– వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ పీడీ

గొంతెండుతున్న పల్లెలు

- కార్మికుల విధుల బహిష్కరణతో నాలుగు రోజులుగా నిలిచిన నీటి సరఫరా

హొళగుంద: సమ్మతగేరి మంచినీటి పథకం కార్మికులు విధులు బహిష్కరించడంతో నాలుగు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ఏడు గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. దీంతో సమ్మతగేరి, కోగిలతోట, ముగుమానుగుంది, ఎల్లార్తి, చిన్నహ్యాట, బీజీ హళ్లి, పెద్దహ్యాట గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయా గ్రామస్తులు కిలోమీటర్ల దూరంలోని పొలాలు, బోరుబావుల వద్దకు ఎద్దుల బండ్లు, బైకులు, సైకిళ్లపై డ్రమ్ములు, కడవలతో వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఎవరూ లేని ఒంటరి వాళ్లు, వృద్ధులు నానా కష్టాలు పడ్తున్నారు. కొందరు గ్రామంలో దొరికే ఉప్పు నీటితోనే సరిపుచ్చుకుంటున్నారు. మంచినీటి పథకంలో పని చేస్తున్న సిబ్బందికి కాంట్రాక్టర్ 10 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు నాలుగు రోజులుగా విధులకు వెళ్లకుండా బహిష్కరించిన సంగతి తెలిసిందే. ప్రధానంగా తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో, ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉన్నా గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడ్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించి మంచినీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.


ఎడ్లబండిపై డ్రమ్ముల్లో నీటిని తెచ్చుకుంటున్న చిన్నహ్యాట గ్రామస్తులు

సమస్య పరిష్కరించాలి



తుంగభద్ర చెంతనే ఎల్లెల్సీ నిండుగా పారుతున్నా, ఎస్ఎస్ ట్యాంకు నిండా నీరున్నా ప్రజలకు సరఫరా చేయడంలో అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమ్మతగేరి మంచి నీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 10 నెలలకు పైగా జీతాలు ఇవ్వకపోవడం వల్లే వారు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజలు నీటి కోసం తిప్పలు పడ్తున్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. వెంటనే సమస్యను పరిష్కరించి గ్రామాలకు మంచినీటిని అందించాలి.

– బుసినె విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

పాఠశాలలో మందుబాబుల బీభత్సం


పాఠశాల ఆవరణలో పడేసిన మద్యం సీసాలు


మందుబాబులు ధ్వంసం చేసిన కోడిగుడ్లు

కల్లూరు: అర్బన్ పరిధిలోని కస్తూరి నగర్ మండల పరిషత్ పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. ఇటీవల బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై పోలీసులు డ్రోన్ల ద్వారా నిఘా పెంచారు. దీంతో మందుబాబులు రూటు మార్చారు. ఏకంగా పాఠశాలనే అడ్డాగా మార్చుకున్నారు. శనివారం రాత్రి పాఠశాల తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించి మద్యం తాగి బీభత్సం సృష్టించారు. అక్కడి సామగ్రిని చిందరవందర చేశారు. విద్యార్థులకు అందించే చిక్కీలు, గుడ్లను ధ్వంసం చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమల్లో వైరల్ అవుతోంది.

పోలీసులకు ఫిర్యాదు

పాఠశాలలో మద్యం సేవించిన విషయం వెలుగులోకి రావడంతో ప్రధానోపాధ్యాయులు వెంటనే స్పందించారు. ఘటనపై ఆదివారం కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తాళాలు పగులగొట్టి బియ్యం, రాగిపిండి, బెల్లం, చిక్కీలు, కోడిగుడ్లను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాల తాళాలు పగులగొట్టిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మైనర్‌ను పెళ్లాడిన యువకుడిపై పోక్సో కేసు

ఆదోని అర్బన్: మైనర్ బాలికను పెళ్లి చేసుకున్న పెద్దహరివాణం గ్రామానికి చెందిన సుధాకర్‌పై ఆదివారం పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఘటనపై టూటౌన్ సీఐ సూర్య మోహన్‌రావు తెలిపిన వివరాలు.. సుధాకర్ మొదటి భార్య మృతిచెందింది. ఈనెల 7వ తేదీన రెండో పెళ్లిగా 14 ఏళ్ల బాలికను వివాహం చేసుకున్నాడు. బాలికకు తండ్రి లేదు, ఆస్పరి మండలం తంగరడోణ గ్రామంలోని మేనమామ ఇంట్లో ఉండి చదువుకుంటోంది. బాలిక తల్లి క్రాంతినగర్‌లో నివాసం ఉంటోంది. అయితే తల్లికి తెలియకుండా మేనమామ బాలికకు మాయమాటలు చెప్పి సుధాకర్‌తో కర్ణాటక రాష్ట్రం సిరుగుప్పలోని ఓ దేవాలయంలో పెళ్లి జరిపించారు. సుధాకర్ కర్ణాటకలో ఉద్యోగం చేస్తున్నాడని మాయమాటలు చెప్పారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు సుధాకర్‌పై పోక్సో చట్టం కింద, పెళ్లి జరిపించిన మరో ఆరుగురిపై బాల్య వివాహ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఐను సస్పెండ్ చేయాలి


మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డిని అగౌరవపరుస్తూ 'రేయ్' అంటూ దుర్భాషలాడిన సీఐ ఇబ్రహీంను వెంటనే సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పార్లపల్లెలో సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీకి నాయకులు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఏకపక్షంగా ఓట్లు వేసుకున్నట్లు సమాచారం అందడంతో మాజీ ఎమ్మెల్యే అక్కడికి వెళ్లారని తెలిపారు. అక్కడ విధుల్లో ఉన్న సీఐ అత్యుత్సాహం ప్రదర్శించి మాజీ ఎమ్మెల్యేను అడ్డుకోవడమే గాకుండా దుర్భషలాడటం, అహంకారపూరితంగా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులు తక్షణం స్పందించి సీఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

వర్చువల్ క్లాస్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన


వర్చువల్ క్లాస్ రూం స్టూడియో ఏర్పాటుకు గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పదో తరగతి విద్యార్థుల కోసం ప్రతి పాఠశాలలో వర్చువల్ క్లాసు రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఆయన ఆదివారం డీఈఓ శామ్యూల్‌పాల్, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి సంకల్‌బాగ్ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో వర్చువల్ క్లాసు రూమ్ కోసం స్టూడియోకు అనువైన భవనాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో వర్చువల్ తరగతి గదులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రతి పాఠశాలకు హైస్పీడ్ నెట్‌వర్క్ ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత భవనంతోపాటు మరో రెండు, మూడు భవనాలను పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం తుంగభద్ర నదీతీర ప్రాంతాన్ని పరిశీలించి పరిశుభ్రత, సుందరీకరణపై కమిషనర్‌కు సూచనలు చేశారు. అనంతరం హరిహర క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధ్యక్షుడు సి.చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

టీడీపీ వర్గాల రగడ

- ఓ వర్గం వేసిన సీసీ రోడ్డును ధ్వంసం చేసిన మరో వర్గం
- మహిళపై దాడి చేయడంతో ధర్నా


రామళ్లకోటలో ధ్వంసమైన సీసీ రోడ్డు


ధర్నా చేస్తున్న శశికళాధర్‌రావు వర్గీయులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని రామళ్లకోటలో టీడీపీకి చెందిన ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. వివరాలు.. గ్రామానికి చెందిన టీడీపీ నేత శశికళాధర్‌రావు ఈ నెల 12న పల్లె పండుగ కార్యక్రమం కింద దిగువపేటలో రూ.10 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. దీనికి టీడీపీ మరో వర్గం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. రోడ్డు వేసే సమయంలో మాటమాట పెంచుకొని ఆయనపై దాడి చేశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పచ్చిగా ఉన్న రోడ్డుపై స్కూటర్లు, సైకిళ్లు, మనుషులు తిరిగి దెబ్బతినేలా చేశారు. దీనిపై శనివారం శశికళాధర్‌రావు వర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీన్ని మనసులో పెట్టుకుని రాత్రి ఓ వ్యక్తి ముఖానికి ముసుగు వేసుకుని వచ్చి ఆయన భార్య మౌనికను ఇసుక పల్లెతో కొట్టాడు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే, నాయకులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో ఆ వర్గం వారు ఆదివారం రహదారిపై ధర్నాకు దిగారు.

పార్టీ కోసం పనిచేసిన వ్యక్తిపైనే దాడి

గ్రామంలో శశికళాధరప్ప, రామకృష్ణ ఆచారి టీడీపీ నాయకులుగా ఉన్నారు. శశికళాధరప్ప ఐటీడీపీ నాయకుడిగా ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలు, ఎమ్మెల్యే అభ్యర్థి ప్రోగ్రాంలను దగ్గరుండి చూసుకున్నారు. ప్రస్తుతం ఆయనపై కొందరు కావాలనే దాడులకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

గ్రామంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో..

గ్రామంలోని అల్లరి మూకలతో ఓ వర్గం వారు నిత్యం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయిస్తున్నట్లు ధర్నాకు దిగిన మహిళలు ఆరోపించారు. దిగువపేట, బోయ పేట, ఎస్సీ పేట, గొల్లపేట, పులగం పేట తదితర ప్రాంతాల్లో రోజు అల్లరిమూకలు రెచ్చిపోతున్నారని వాపోయారు. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మహిళలు మౌనిక, జయమ్మ, లక్ష్మీదేవి తదితరులు స్పష్టం చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే సాకుతో ఈ వివాదం బయటకు రాకుండా ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ రియల్‌ఎస్టేట్ రంగంలో రాణించాలనే కోరిక ఉన్న వారికి మా JK Ventures కర్నూలు సంస్థ ఆహ్వానం పలుకుతుంది. చిన్న పెట్టుబడి ద్వారా కంపెనీలో పార్టనర్‌గా చేరి మంచి ఆదాయాన్ని పొందే అవకాశం కలదు. గమనిక: ల్యాండ్ హామీగా ఇచ్చి పెట్టుబడిని ఆహ్వానిస్తున్నాం. వివరాలకు సంప్ర: 94408 07002 [L-794876]

PLOT FOR SALE

■ 25,000/- వేల కోట్ల నిధులతో మరో హైదరాబాద్, మరో బెంగుళూరు సిటీలాగా అభివృద్ధి చెందుతున్న మన రాజధాని అమరావతికి ప్రక్కన 40x60, 55x80 సైజు గల ప్లాటు 51/2 సెంట్లు, 10 సెంట్ల ప్లాట్లు కలవు. సెంటు ధర 2,50,000/- నుండి ప్రారంభం అగును. గమనిక: ఈ ప్రదేశంలో అపార్ట్‌మెంట్‌లో, విల్లాలు కడుతున్నారు. మీ పిల్లల భవిష్యత్తుకి Capital లో మంచి ప్రాపర్టీ అవుతుంది. రవి, కర్నూలు. 79932 95913 [L-794886]

WANTED

■ ప్రముఖ Enovizen సంస్థ యందు ఉద్యోగాలు కలవు. వార్డ్ బాయ్స్, సెక్యూరిటీ గార్డ్స్, సేల్స్ గర్ల్స్ & బాయ్స్ కావలెను. సంప్ర: 95151 30414, 73863 46463, 96668 48880 [L-SCA24000844]

■ ప్రముఖ స్కూలు నందు పనిచేయుటకు ప్రిన్సిపాల్ మరియు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. అర్హత కలిగిన వారు క్రింది ఫోన్ నెంబర్‌కు రెజ్యూమ్‌ను Whats app చేయగలరు. సెల్: 82477 36146. [L-783214]

■ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు 30 కి.మీ. దూరంలో బెంగళూరు హైవేపై షాద్‌నగర్ బైపాస్‌లో గల లాడ్జిలో పని చేయుటకు రిసెప్షనిస్టులు, బాయ్స్ కావలెను. మంచి జీతం, వసతి కలదు. ✆ 9912139159, 8639154959 [J-1749]

■ శ్రీ పద్మప్రియ ఫైనాన్స్ నంద్యాల, కర్నూల్ & యెమ్మిగనూరులో పనిచేయుటకు సేల్స్ మేనేజర్ (పు) కావలెను. 2 సం॥ అనుభవం, అర్హత :ఇంటర్, ఇంటర్వ్యూ: 19, 20, 21 ✆ : 92814 52883, 92810 22773 [R-947]

■ కష్టజీవ్వే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984 [HA-99259]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పెషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000833]

■ వర్క్ ఫ్రం హోమ్. డేటా ఎంట్రీ: ప్రముఖ ఔట్ సోర్సింగ్ సంస్థ నందు ఇంటివద్ద ఉండి పార్ట్/ఫుల్ టైమ్ ప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop / Desktop స్మార్ట్ ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 74164 40882 [B-721]

■ ఆస్త్రా హోమ్ కేర్ హైదరాబాద్ ఫిమేల్ కేర్ టేకర్స్ మాత్రమే కావలెను. జీతం: 18-20వేలు, సంవత్సరం లోపు 22-25కి పెరిగే అవకాశం. వయస్సు: 20-45లోపు ఉచిత భోజన వసతి. 7680922316 [G-2466]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ఉత్కంఠ పోరులో జిల్లా జట్టు విజయం

- హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్
- రన్నరప్‌గా వైజాగ్ జట్టు


వైజాగ్ క్రీడాకారుడిని గోల్‌పోస్టు వద్ద అడ్డుకుంటున్న కర్నూలు క్రీడాకారులు

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరి ఎలైట్ పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన 10వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ (పురుషుల) ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. నువ్వా.. నేనా అనే రీతిలో క్రీడాకారులు తలపడ్డారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో వైజాగ్ జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. మూడో స్థానంలో అనంతపురం, చిత్తూరు జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను ముఖ్యఅతిథులు సీఐ టీవీ శ్రీహర్ష, మాంటిస్సోరి పాఠశాల ఎండీ కృష్ణభరత్, కళాశాల ఇన్‌చార్జి మధు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎన్.కేశవమూర్తి, రాష్ట్ర సంఘం సభ్యుడు విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, మురళి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుగుణమ్మ, సీనియర్ పీడీలు నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


విజేత ట్రోఫీని అందుకుంటున్న కర్నూలు జట్టు


రన్నరప్ టైటిల్ దక్కించుకున్న వైజాగ్ జట్టు

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

కర్నూలు కల్చరల్: కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గీతా నగర్‌లో ఆదివారం చోరీ జరిగింది. స్థానికంగా నివాసం ఉండే శ్రీనివాసరెడ్డి దంపతులు ఇంటికి తాళం వేసి పుణ్య క్షేత్రాలకు వెళ్లారు. ఇదే అదనుగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఇంటికి వెళ్లిన పనిమనిషి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చింది. యజమాని ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఇంటి యజమాని వచ్చాక చోరీ సొత్తు వివరాలు తెలిసే అవకాశం ఉంది.

మందుబాబులపై కేసు

కర్నూలు కల్చరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు కర్నూలు డీఎస్పీ జె.బాబుప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం త్రీటౌన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాతో బిర్లా జంక్షన్ వద్ద నిఘా పెట్టి చట్ట వ్యతిరేకంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మన్మధ విజయ్, ట్రాఫిక్ ఎస్ఐ రెహమాన్, ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.